Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
12-09-2025

ANN తెలుగు

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 279 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శుక్రవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## హైదరాబాద్‌కు హైస్పీడ్ కనెక్టివిటీ

**బెంగళూరు, చెన్నై, అమరావతికి హైస్పీడ్ రైళ్లు**

రైల్వే అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష

రీజనల్ రింగ్ రోడ్డు పక్కనే రింగ్ రైలు మార్గం నిర్మాణం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక అడుగులు వేస్తున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను దేశంలోని ఇతర ప్రధాన నగరాలతో అనుసంధానించే మూడు హైస్పీడ్ రైలు మార్గాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఒక్కో ఓటుకు రూ.20 కోట్లు

- బీజేపీపై బీఆర్ఎస్ సంచలన ఆరోపణలు
- మహిళా ఎంపీ సహా ఐదుగురు ఎంపీలు క్రాస్ ఓటింగ్



02

### కేటీఆర్ నీకు నీతి ఎక్కడిది?

- మంత్రి సీతక్క ఫైర్



02

### హన్సికకు కోర్టులో షాక్

- విచారణ ఎదుర్కోవాల్సిందే..



08

SRI GOLD
TRUSTED GOLD BUYERS

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,10,290 |
| 22 క్యారెట్ | 1,01,100 |
| సిల్వర్ (కేజీ) | 1,30,000 |

# ఇళ్ల హీరో

## పొంగులేటి శ్రీనివాసరెడ్డి సక్సెస్

**సవాల్‌గా మారిన ఇళ్ల పథకాన్ని సక్సెస్ చేసిన సమర్థుడు**

పథకం అమలుపై ప్రజల హర్షం

మచ్చలేకుండా విధానాలు.. అద్భుతంగా అమలు

ఎంపికలో.. బిల్లుల్లో.. అంతటా పారదర్శకత

సీఎం రేవంత్ సహా కేబినెట్ సహచరుల అభినందనలు

(కంది రామచంద్రారెడ్డి)

రాజకీయాల్లో పరిస్థితులు చాలా మందికి అవకాశాలు ఇస్తాయి. వాటిని నిలబెట్టుకుని నిజాయితీగా ప్రజలకు మేలుచేసిన వారే జనం గుండెల్లో నిలిచిపోతారు. తెలంగాణ రాజకీయాల్లో విలక్షణ రాజకీయనేతగా, పరిణతితో వ్యవహరించే నేతగా పేరున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రిగా తన సమర్థత చాటుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇళ్లకోసం పదేళ్ళుగా కళ్ళు కాయలుకాయేలా ఎదురుచూసిన వారి నిరీక్షణకు తెరదించడమే కాక, ప్రత్యర్థులు కూడా మెచ్చేలా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రూపొందించి అమలుచేస్తున్న ఘనత పొంగులేటిదే. అందుకే పొంగులేటిని ప్రజలు హీరోగా కీర్తిస్తున్నారు. ఇళ్లమంత్రికి జేజేలు పలుకుతున్నారు. తన ముఖంలో ఎపుడూ కనిపించే చెదరని చిరునవ్వు ప్రజల మోములోనూ కనిపించాలనే కోరికతో రాజకీయాలనే సేవగా, దీక్షగా చేస్తున్న పొంగులేటి ఇళ్ల పథకంతో పేదల జీవితకాల కోరిక తీరుస్తున్నాడు. డబుల్ బెడ్ రూం ఇళ్ల చిక్కులు, బడ్జెట్ సమస్యలు.. పదేళ్ళుగా ప్రజల ఎదురుచూపుల నేపథ్యంలో.. ఇళ్ల పథకాన్ని గాడిలో పెట్టడం, ప్రజలను మెప్పించడం అంత ఆషామాషీ కాదు. పొంగులేటి కృషి , పథకం అమలులో పారదర్శకత ప్రశంసలందుకుంటోంది.

వివరాలు 2లో




## 4 గంటల్లో 17 సెం.మీ. వర్షం

**అల్లాడిన మెదక్ ప్రజలు**

హైదరాబాద్‌లో దంచికొట్టిన భారీ వర్షం

ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు జలదిగ్బంధంలో నేషనల్ హైవే


14వరకు దంచుడే.. దంచుడు.. అలర్ట్ గా ఉండాలని సీఎం ఆదేశం

ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు జలదిగ్బంధంలో జాతీయరహదారి



**హైదరాబాద్, మెదక్- మహా:** రాష్ట్రవ్యాప్తంగా వానలు దంచికొడుతుండగా, ప్రజలు అల్లాడుతున్నారు. హైదరాబాద్ ను వర్షం అతలా కుతలం చేసింది. ఈనెల 14 దాకా వర్షాలు బారీగా ఉండనుండడంతో అధికారులు అలర్ట్ గా ఉండాలని సీఎం ఆదేశించారు. మెదక్ జిల్లాలో వర్షం బీభత్సం సృష్టించింది. 4 గంటల వ్యవధిలో 17 సెంటీమీటర్ల అతి భారీ వర్షం కురిసింది. ఆర్‌డీఓ కార్యాలయం వద్ద 176 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా రాజ్‌పల్లిలో 132 మిల్లీమీటర్లు మేర కురిసింది. అటు కుల్చారం, పాతూర్, హవేలీఘన్‌పూర్, ఎల్దుర్తి, రామాయంపేట్‌లో భారీ వర్షపాతం నమోదు అయింది. మెదక్ పట్టణంలో అతి భారీ వర్షం కురిసింది.

మిగతా 2లో



05

### కుప్పకూలిన ఆదిలాబాద్ కలెక్టరేట్ బిల్డింగ్

నిజాం కాలం నాటి భవనం



### కేసీఆర్‌కు బిగ్ షాక్

**కవితకు చింతమడక గ్రామస్తుల ఆహ్వానం**

**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఆమె తండ్రి కేసీఆర్ సొంత ఊరు నుంచి ఆహ్వానం వచ్చింది. చింతమడకలో సెప్టెంబర్ 21న జరిగే ఎంగిలిపూల బతుకమ్మకు రావాలని ఆ గ్రామస్తులు గురువారం ఆమెను ఆహ్వానించారు.

మిగతా 2లో

### గొర్రెల స్కామ్‌లో కీలక పరిణామం

**పలువురికి ఈడీ నోటీసులు**

ఈ నెల 19న విచారణకు రావాలని ఆదేశం

**హైదరాబాద్, మహా:** గొర్రెల పంపిణీ కుంభకోణంలో దర్యాప్తును ఈడీ అధికారులు వేగవంతం చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించి ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ నెల 15న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని గొర్రెల పంపిణీ కుంభకోణం బాధితులకు నోటీసులు జారీ చేసింది.

మిగతా 2లో



### ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

**కేంద్ర కమిటీ సభ్యుడు సహా 10మంది నక్సల్స్ మృతి**

**వరంగల్, మహా:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. గరియాబాద్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10మంది నక్సల్స్ మృతి చెందారు. వారిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మనోజ్ అలియాస్ మోదెం బాలకృష్ణ, ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రమోద్ యారఫ్ పాండు సహా కీలక సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది.

మిగతా 2లో



### అన్ని రంగాల్లో కాంగ్రెస్ విఫలం

**ఆరు గ్యారంటీల్లేవు.. జాబ్ క్యాలెండర్ లేదు**

ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్థం.. బిజెపి చీఫ్ రామచందర్ రావు విమర్శలు

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల తర్వాత అన్ని రంగాల్లో విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 100 రోజుల్లో నెరవేరుస్తామని చెప్పి 22 నెలలు గడిచిన వాటి ఊసే లేదన్నారు. గురువారం తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడారు.

మిగతా 2లో






### నాలుగున్నర ఎకరాలకు 3.5 వేల కోట్లు

- ముంబైలో ఖరీదైన స్థలం కొనుగోలు చేసిన ఆర్బీఐ
- ఈ ఏడాది భూమి కొనుగోళ్లలో ఇదే రికార్డు

02

### అమెరికాలో దారుణం

**తుపాకీ హింసపై మాట్లాడుతుండగానే ట్రంప్ అనుచరుడి హత్య**

- ఉటా యూనివర్సిటీలో బహిరంగ సభలో ఘటన
- కిర్క్ మృతిని ధ్రువీకరించి, నివాళులర్పించిన డొనాల్డ్ ట్రంప్
- దేశవ్యాప్తంగా పెరుగుతున్న రాజకీయ హింసపై ఆందోళన

వివరాలు 3లో

# ఇళ్ళ హీరో

## పొంగులేటి శ్రీనివాసరెడ్డి సక్సెస్

### సవాల్ గా మారిన ఇళ్ళపథకాన్ని సక్సెస్ చేసిన సమర్ధుడు

పథకం అమలుపై ప్రజల హర్షం.. మచ్చలేకుండా విధానాలు.. అద్భుతంగా అమలు

ఎంపికలో.. బిల్లుల్లో.. అంతటా పారదర్శకత

ముఖ్యమంత్రి రేవంత్ సహ కేబినెట్ సహచరుల అభినందనలు

(కంది రామచంద్రారెడ్డి)

రాజకీయాల్లో పరిస్థితులు చాలా మందికి అవకాశాలు ఇస్తాయి. వాటిని నిలబెట్టుకుని నిజాయితీగా ప్రజలకు మేలుచేసిన వారే జనం గుండెల్లో నిలిచిపోతారు. తెలంగాణ రాజకీయాల్లో విలక్షణ రాజకీయనేతగా, పరిణతితో వ్యవహరించే నేతగా పేరున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రిగా తన సమర్ధత చాటుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇళ్ళకోసం పదేళ్ళుగా కళ్ళు కాయలుకాయేలా ఎదురుచూసిన వారి నిరీక్షణకు తెరదించడమే కాక, ప్రత్యర్ధులు కూడా మెచ్చేలా ఇందిరమ్మ ఇళ్ళ పథకాన్ని రూపొందించి అమలుచేస్తున్న ఘనత పొంగులేటిదే. అందుకే పొంగులేటిని ప్రజలు హీరోగా కీర్తిస్తున్నారు. ఇళ్ళమంత్రికి జేజేలు పలుకుతున్నారు. తన ముఖంలో ఎపుడూ కనిపించే చెదరని చిరునవ్వు ప్రజల మోములోనూ కనిపించాలనే కోరికతో రాజకీయాలనే సేవగా, దీక్షగా చేస్తున్న పొంగులేటి ఇళ్ళ పథకంతో పేదల జీవితకాల కోరిక తీరుస్తున్నాడు. డబుల్ బెడ్ రూం ఇళ్ళ చిక్కులు, బడ్జెట్ సమస్యలు.. పదేళ్ళుగా ప్రజల ఎదురుచూపుల నేపథ్యంలో.. ఇళ్ళ పథకాన్ని గాడిలో పెట్టడం, ప్రజలను మెప్పించడం అంత ఆషామాషీ కాదు. పొంగులేటి కృషి, పథకం అమలులో పారదర్శకత ప్రశంసలందుకుంటోంది. తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైన పథకాలు అమలుచేయడంలో ఆయన పాత్ర స్పష్టమవుతోంది. ఇటీవల ఖమ్మం జిల్లాలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ళప్రారంభోత్సవంలో పొంగులేటి శ్రీనన్న సమర్ధుడు కాబట్టే ఈ శాఖ అప్పగించామని, చిన్న రిమార్క్ లేకుండా అద్భుతంగా పేదోళ్ళకు ఇళ్ళు కట్టిస్తున్నాడంటూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల సమక్షంలో అభినందించారు.

**సక్సెస్ కు కేరాఫ్**

పొంగులేటి అంటే సక్సెస్ కేరాఫ్ అని అనేక సందర్భాల్లో రుజువైంది. ప్రజలు శ్రీనన్న అంటూ ప్రేమగా పిలుచుకునే ఆయన ఆధునిక రాజకీయాల్లో ప్రత్యేకం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డేరింగ్ అండ్ డాషింగ్ లీడర్ గా పేరున్న పొంగులేటి శ్రీనన్న అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్రంలోనే ఓ ఎట్రాక్షన్ గా మారారు. ఇపుడు మంత్రిగా ధరణి దరిద్రాన్ని వదిలించడంలో, ప్రజల కల ఇందిరమ్మ ఇళ్ళ పథకాన్ని పట్టాలెక్కించడంలో ఆయన మార్క్ పనితీరు కనబడుతోంది. ఇందిరమ్మ పథకం ప్రారంభించేముందు, పథకం సవాళ్ళు, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన పథకం, ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన ఇళ్ళపథకం అన్నింటినీ అధ్యయనం చేసి, సమీక్షించి.. ఎలాంటి చర్చకు, విమర్శకు తావులేకుండా కొత్త విధానాలతో ఇందిరమ్మగైడ్ లైన్స్ రూపొందించారు. పథకం అమలువిధానంపై ప్రజలు కూడా సంతోషంగా చెబుతున్నారు. తాము ఏదైనా తప్పుచేసినా, కొలతలు సరిగా లేకున్నా.. సిస్టమ్ ఆటోమెటిక్ గుర్తుపట్టి, నిబంధనల ప్రకారం లేకుంటే ఇళ్ళే రద్దయిపోతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

**రూ.22 వేల కోట్లు ఖర్చు చేసి 4.5 లక్షల మందికి**

ఒక్క ఏడాదిలోనే ఈ పథకానికి రూ.22 వేల కోట్లు ఖర్చు చేసి 4.5 లక్షల మంది పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం శ్రమిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక గృహ నిర్మాణ కార్యక్రమం, గరీబులకు సొంత ఇల్లు కల్పించేందుకు లక్ష్యంగా అమలవుతోంది. ఈ పథకం ద్వారా ప్రతి లబ్ధిదారుకు రూ. 5 లక్షల



ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించుకున్న లబ్ధిదారుల కళ్ళల్లో సంతోషం చూసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా లబ్ధిదారుల కళ్ళల్లో ఈ తృప్తి కోసమే తాము రాజకీయాల్లోకి వచ్చామన్నారు. మొత్తం 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా మొదటి విడత ప్రారంభించబడింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల కేటాయించబడ్డాయి. ఇప్పటివరకు 3.68 లక్షల ఇళ్లకు మంజూరులు జారీ చేయబడ్డాయి, అందులో 2లక్షల ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభంకాగా, బిల్లుల చెల్లింపు కూడా పారదర్శకంగా జరుగుతోంది.

**పారదర్శకంగా..**

ఇంటి నిర్మాణం ప్రారంభించిన ప్రతి సోమవారం నాడు లబ్ధిదారులకు నేరుగా నగదు విడుదల చేస్తున్నారు. ప్రతి విడత నిర్మాణం పూర్తి అయిన తర్వాత, లబ్ధిదారులకు రూ. 1 లక్ష నుంచి రూ. 1.75 లక్షల వరకు చెల్లిస్తున్నారు. అలాగే, నిర్మాణానికి కావాల్సిన మట్టి, సిమెంట్, ఇసుక వంటి పదార్థాలను సబ్సిడీ ధరలతో లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. గృహ నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు నెల రోజుల వ్యవధిలో నిర్మాణం ప్రారంభించాలని సూచించారు, లేకపోతే వారి కేటాయింపు రద్దు చేయబడుతుందని హెచ్చరించారు. ప్రస్తుతం పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతున్నట్లు కనిపిస్తోంది. నిర్మాణం ప్రారంభించిన ఇళ్ల సంఖ్య, నిధుల విడుదల, మరియు లబ్ధిదారుల స్పందన ఆధారంగా పథకానికి మంచి స్పందన లభిస్తోంది. అక్కడక్కడా చిన్నచిన్న సమస్యలున్నా.. ఇందిరమ్మ పథకం మాత్రం మూడు శంఖుస్థాపనలు.. ఆరు ప్రారంభోత్సవాలు అన్నట్లు గ్రామాల్లో పండుగకళతో కళకళలాడుతోంది.



**మెటీరియల్ పైనా..**

తెలంగాణలో సొంత స్థలం ఉన్నా.. ఆర్థిక స్తోమత లేక ఇల్లు కట్టుకోలేకపోతున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఆశాజనకంగా మారింది. ఈ పథకం కింద లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల కారణంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు సర్కార్ మరో సానుకూల నిర్ణయం తీసుకుంది. పెరుగుతున్న సిమెంట్, స్టీల్ ధరల దృష్ట్యా ప్రభుత్వం.. మరో ముందడుగు వేసింది. సిమెంట్, స్టీల్ ధరలు ఇటీవల గణనీయంగా పెరగడంతో నిర్మాణ ఖర్చు పేదలకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి, ఈ కీలక నిర్మాణ సామగ్రిని లబ్ధిదారులకు తక్కువ ధరలకే అందించేందుకు పూనుకుంది. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్రస్థాయిలో ఈ కమిటీకి ఛైర్మన్‌గా, జిల్లాల స్థాయిలో కలెక్టర్లు కమిటీ ఛైర్మన్‌లుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీ సిమెంట్, స్టీల్ వంటి పదార్థాలకు ఒక నిర్దిష్ట ధరను నిర్ణయించి.. అదే ధరకు లబ్ధిదారులకు అందేలా పర్యవేక్షిస్తుంది. దీనివల్ల మధ్యవర్తుల దోపిడీకి చెక్ పడుతుంది. ప్రజలు అధిక ధరలు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఊరట లభిస్తుంది. ఇలాంటి అనేక కార్యక్రమాలు పకడ్బందీగా ప్రభుత్వం గమనిస్తూ వేగంగా పథకం ముందుకు సాగేందుకు దోహదం చేస్తోంది. జీఎస్టీ తగ్గుదలతో స్టీల్ సిమెంట్ రేట్ల ధరలు తగ్గనున్న నేపథ్యంలో పథకం ఫలాలు మరింత వేగంగా లబ్దిదారులకు చేరే అవకాశముంది.

# 4 గంటల్లో 17 సెం.మీ. వర్షం

## అల్లాడిన మెదక్ ప్రజలు

హైదరాబాద్‌లో దంచికొట్టిన భారీ వర్షం

ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు జలదిగ్బంధంలో నేషనల్ హైవే

14వరకు దంచుడే.. దంచుడు.. అలర్ట్ గా ఉండాలని సీఎం ఆదేశం

(మొదటిపేజీ తరువాయి)

పట్టణంలోని రోడ్లు అన్నీ చెరువులను తలపిస్తూ జలమయం అయ్యాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వరద నీరు చేరింది. మెదక్‌లోని గాంధీనగర్ కాలనీ, సాయినగర్ కాలనీ వెంకట్రావు నగర్ కాలనీ, ఫతే నహర్ కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.

**చెరువులా ఎల్బీనగర్ నేషనల్ హైవే**

హైదరాబాద్ నగర ప్రజలను వర్షాలు వదలడం లేదు. ఇటీవల కురిసిన కుంభవృష్టి నుంచి తేరుకోక ముందే బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో జీహెచ్ఎంసీ పరిధిలో భారీ వర్షం పడింది. గురువారం మధ్యాహ్నం నుంచి పలు ప్రాంతాల్లో వర్షం మూడు గంటలకు పైగా దంచికొట్టింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌తో పాటు అబ్దుల్లాపుర్ మెట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రామోజీ ఫిల్మ్ సిటీ పరిసర ప్రాంతాల్లో కుండపోత వర్షం పడింది. సుమారు గంటన్నర పాటు కురిసిన భారీ వర్షంతో 10.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, అమీర్ పేట్, ఎస్ఆర్‌నగర్ ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. తార్నాక, ఓయూ క్యాంపస్, లాలాపేట్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. భారీవర్షంతో ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు జాతీయ రహదారి వరదనీటితో మునిగిపోయింది. ట్రాఫిక్‌కు ఎక్కడికక్కడ అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు కాలనీల్లో వరద నీరు రహదారులను ముంచెత్తింది. అటు పంజాగుట్ట, అమీర్ పేట్, మియాపూర్, కొండాపూర్‌లోనూ భారీవర్షం ముంచెత్తింది.

**భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి**

**: అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

**హైదరాబాద్, మహా:** నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. పురాతన ఇళ్లలో ఉన్నవారిని



ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, ట్రాఫిక్, పోలీసు సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వాగులపై ఉన్న లోతట్టు కాజ్‌వేలు, కల్వర్టుల నుంచి నీటి ప్రవాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. చెరువులు, కుంటలకు గండి పడే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు.

**ఎల్లో అలర్ట్ జారీ :**

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో పలు ప్రాంతాల్లో ఈ నెల 14 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం, శుక్రవారం ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వచ్చే మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు వెల్లడించారు. పలు జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు భారీ వర్ష సూచన ఉంది.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

మైన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలకు గురువారం మధ్యాహ్నం మావోయిస్టులు తారసపడ్డారు. బలగాలను చూడగానే మావోయిస్టులు కాల్పులకు దిగారు. వెంటనే అప్రమత్తమైన భద్రత బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో పదిమంది మావోయిస్టులను బలగాలు హతమార్చాయి. మృతుల్లో మనోజ్‌తో పాటు ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండు కూడా మృతి చెందినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో పెద్ద సంఖ్యలో ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో వరంగల్ ఘన్‌పూర్‌కు చెందిన మనోజ్ మృతి చెందినట్లు బలగాలు గుర్తించాయి. మనోజ్‌ను బాలన్న, రామచందర్, భాస్కర్ అనే పలు పేర్లతో పిలుస్తారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న మనోజ్‌పై రూ.2 కోట్ల వరకు రివార్డు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో మనోజ్ చురుకుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర కమిటీలో కీలక సభ్యుడైన మనోజ్ మృతి మావోయిస్టులకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

# అన్ని రంగాల్లో కాంగ్రెస్ విఫలం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ నాయకులు విదేశీ పర్యటనల ప్రయాణ, ఫ్లైట్ ఖర్చులు వృథా చేయడం తప్ప తెలంగాణకు ఒరగబెట్టింది గుండుసున్నా అని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా దిగజారిపోయిందని, సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు వెళ్లి రాష్ట్రానికి రూ. 70 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని, మలేషియా, సింగపూర్ పర్యటనలకు వెళ్లి రూ. 10 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొస్తామన్నారని మరి ఆ పెట్టుబడులు ఏమైనట్లు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ఒక్క ప్రాజెక్ట్‌ను కూడా సక్రమంగా ప్రారంభించలేదు. జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థ, భద్రతా చర్యల్లో విఫలమైంది. రేవంత్‌పరిపాలనకు పక్షవాతం వచ్చిందన్నారు. కాంగ్రెస్ నాయకులు కేంద్రం మెడలు వంచుతామని విమర్శలు చేస్తున్నారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను, మోసాన్ని ప్రజల గ్రహించారు. వాస్తవ పరిస్థితులను గుర్తు చేసుకుని కాంగ్రెస్ పార్టీకి సరైన బుద్ధిచెబుతారు. గ్రూప్ 1 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ నిర్వహించిన మెయిన్స్ పరీక్షల్లో పరీక్షా ప్రక్రియలో గందరగోళాలు, నిర్వహణలో లెక్కలేనన్ని అవకతవకలు జరిగాయని హైకోర్టు తేల్చింది. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి ఇప్పటివరకు ఒక్క పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేకపోయారని ఇది వారి అసమర్థతను చూపుతోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# గొర్రెల స్కామ్‌లో కీలక పరిణామం

## పలువురికి ఈడీ నోటీసులు

### ఈ నెల 19 న విచారణకు రావాలని ఆదేశం

(మొదటిపేజీ తరువాయి)

మొయినుద్దీన్ అండ్ గ్యాంగ్ ఏపీకి చెందిన రైతుల నుంచి గొర్రెలు కొనుగోలు చేసి దాదాపు రూ.2కోట్లు మేర మోసం చేసినట్టు ఈడీ దృష్టికి వచ్చింది. రైతులకు చెల్లించాల్సిన నగదును ప్రభుత్వ అధికారుల సాయంతో బినామీలు, సొంత ఖాతాలకు మొయినుద్దీన్ బదిలీ చేసుకున్నట్టు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది.

**రూ.700 కోట్ల కుంభకోణం..**

గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలను మనీ లాండరింగ్ కేసుగా ఈడీ విచారణకు స్వీకరించింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో చోటుచేసుకున్న అక్రమాలపై ఏసీబీ విచారణ చేస్తున్న సంగతి తెలిసిందే. గొర్రెల కొనుగోళ్ల పేరిట రూ.700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కేసులో పెద్దఎత్తున డబ్బు చేతులు మారడం, ఇతర రాష్ట్రాలకూ లింకు ఉండడంతో ఈడీ రంగంలోకి దిగింది. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలంటూ ఇప్పటికే గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్యకు హైదరాబాద్‌లోని ఈడీ జోనల్ కార్యాలయం లేఖ రాసింది. జిల్లాలవారీగా లబ్ధిదారుల వివరాలు, అడ్రస్, కాంటాక్ట్ సెల్ నంబర్లు, బ్యాంకు ఖాతా నంబరు, బ్యాంకు పేరు, బ్రాంచి పేరు తదితర వివరాలను ఇవ్వాలని కోరింది. జిల్లాలవారీగా లబ్ధిదారులకు గొర్రెలు అమ్మిన యజమానుల పూర్తి వివరాలు కూడా సమర్పించాలని స్పష్టం చేసింది. గొర్రెలు, మేకల సహకార అభివృద్ధి సంస్థకు సంబంధించిన ఏ బ్యాంకు ఖాతా నుంచి నిధులు బదిలీ చేశారు.. బ్యాంకు బ్రాంచి వివరాలు ఏమిటి.. జిల్లాలవారీగా లబ్ధిదారులు తమ వాటా ధనాన్ని ఏ బ్యాంకు ఖాతా నుంచి ఏ బ్యాంకు ఖాతాకు జమ చేశారు.. ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలు, రవాణా చేసిన వాహనాలు, గొర్రెల యూనిట్ల వివరాలు కూడా ఇవ్వాలని కోరింది.



# కేసీఆర్‌కు బిగ్ షాక్

## కవితకు చింతమడక గ్రామస్తుల ఆహ్వానం

(మొదటిపేజీ తరువాయి)

బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయానికి గురువారం చింతమడక గ్రామస్తులు పెద్దసంఖ్యలో వచ్చి కవితలో భేటీ అయ్యారు. గ్రామంలో జరిగే బతుకమ్మ సంబరాలకు హాజరుకావాలని పిలిచారు. బతుకమ్మకు నా సొంత ఊరుకు పిలవడం చాలా సంతోషంగా ఉందని కవిత ఆనందం వ్యక్తం చేశారు. గొప్ప ఉద్యమకారుడిని కన్న గొప్ప ఊరు మా చింతమడక అంటూ.. ఆమె చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఆమె చింతమడక నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాయని అన్నారు. చింతమడకలో బతుకమ్మ ఆడిన రోజులు ఇంకా కండ్ల ముందే ఉన్నాయని ఆమె అన్నారు. ఈ సమయంలో మీరంతా వచ్చి తనకు ధైర్యం ఇచ్చారని కవిత అన్నారు.

# హైదరాబాద్‌కు హైస్పీడ్ కనెక్టివిటీ

## బెంగళూరు, చెన్నై, అమరావతికి హైస్పీడ్ రైళ్లు

రైల్వే అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష

రీజనల్ రింగ్ రోడ్డు పక్కనే రింగ్ రైలు మార్గం నిర్మాణం



హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, అమరావతి నగరాలకు ఈ బుల్లెట్ రైలు కారిడార్లను నిర్మించేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో పాటు ఇతర కొత్త రైల్వే లైన్ల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రైల్వే శాఖకు చెందిన ముఖ్య ఇంజనీర్లు సైతం పాల్గొన్నారు. హైదరాబాద్ చెన్నై, హైదరాబాద్ బెంగళూరు హైస్పీడ్ రైలు మార్గాలకు సంబంధించిన అలైన్‌మెంట్లను అధికారులు ఇప్పటికే ఖరారు చేశారు. హైదరాబాద్ చెన్నై మార్గం కాజీపేట మీదుగా కాకుండా నార్కట్‌పల్లి, సూర్యాపేట, కోదాడ మీదుగా వెళ్ళేలా ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఈ సమావేశంలో ఆదేశించారు. ఈ మార్గంలో తెలంగాణ పరిధిలో దాదాపు 6 నుంచి 7 స్టేషన్లు ఉండే అవకాశం ఉంది. ఇక హైదరాబాద్‌బెంగళూరు హైస్పీడ్ మార్గాన్ని ప్రతిపాదిత నాగ్‌పూర్ హైదరాబాద్‌బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సమాంతరంగా నిర్మించనున్నారు. దీనికి సంబంధించి మూడు రకాల అలైన్‌మెంట్లను సిద్ధం చేయగా, రాష్ట్రంలో 4 నుంచి 5 స్టేషన్లు ఏర్పాటు కావొచ్చని అంచనా వేస్తున్నారు.

**అమరావతి మార్గంపై కొనసాగుతున్న కసరత్తు**

మరోవైపు, హైదరాబాద్ అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సమాంతరంగా హైస్పీడ్ రైలు మార్గాన్ని కూడా నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. దీనిపై ప్రస్తుతం కేంద్రం పరిశీలిస్తోంది. ఈ రైలు మార్గంపై కేంద్రం వైఖరి, రైల్వే శాఖ అభిప్రాయాలను సీఎం రేవంత్ రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు, రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) పక్కనే రీజనల్ రింగ్ రైలు మార్గాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు ఆర్ఆర్ఆర్ పొడవునా 45 మీటర్ల వెడల్పుతో భూమి అవసరమని రైల్వే అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సమీక్షలో ఈ అంశాలతో పాటు వికారాబాద్ కృష్ణా, డోర్నకల్ గద్వాల, కల్వకుర్తి మాచర్ల వంటి కొత్త రైల్వే లైన్లపైనా సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. వీలైనంత త్వరగా ప్రాజెక్టులపై స్పష్టతకు రావాలని, అనంతరం రాష్ట్రం తీసుకోబోయే చర్యలపై కేంద్రానికి, రైల్వే శాఖకు స్పష్టత ఇస్తే ప్రాజెక్టులో పురోగతి ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు.

# కామారెడ్డికి రూ. కోటి నిధులు

## రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

**కామారెడ్డి, మహా:** కామారెడ్డి జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు లింగంపేట మండలం కుర్దులో హైలెవల్ వంతెన తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కామారెడ్డి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇటీవల సీఎం రేవంత్ పర్యటించారు. కరీంనగర్‌కామారెడ్డిఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై లింగంపల్లి కుర్దు గ్రామ శివారులో దెబ్బతిన్న వంతెనను సీఎం పరిశీలించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని.. డైవర్షన్ రోడ్డు అత్యవసరమని రేవంత్ దృష్టికి స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. త్వరలోనే డైవర్షన్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ నారాయణ తెలిపారు.

# ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఒక్కో ఓటుకు రూ.20 కోట్లు

## బీజేపీపై టీఎంసీ సంచలన ఆరోపణలు

### మహిళా ఎంపీ సహా ఐదుగురు ఎంపీలు క్రాస్ ఓటింగ్

**మహా:** ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ పై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. అధికార బీజేపీ తన అభ్యర్థిని గెలిపించుకునేందుకు అక్రమాలకు పాల్పడిందని టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక్కో ఓటుకు రూ. 20 కోట్లు ఇచ్చి ఇండియా కూటమి ఎంపీలను కొనుగోలు చేసిందని మండిపడ్డారు. కూటమి ఐక్యతను ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఓ మహిళా ఎంపీ దెబ్బ తీశారని ఆయన ఆరోపించారు. ఆప్ అధ్యక్షుడు అర్వింద్ కేజ్రీవాల్ ను విమర్శించే సదరు ఎంపీ బహిరంగంగానే బీజేపీకి మద్దతు తెలిపారని, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి కట్టుబాటును తుంగలో తొక్కారని అభిషేక్ బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ మహిళా ఎంపీ సహా మొత్తం ఐదుగురు ఎంపీలు క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డారని, ఇండియా కూటమి అభ్యర్థిని కాదని ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్ కు ఓటేశారని




అన్నారు. ఈ క్రాస్ ఓటింగ్ కారణంగానే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థికి భారీ మెజారిటీ లభించిందని అభిషేక్ వ్యాఖ్యానించారు. చెల్లకుండా పోయిన ఓట్లను పరిగణనలోకి తీసుకున్నా కనీసం ఐదు నుంచి ఏడుగురు ఎంపీలు క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డట్లు అర్థమవుతోందని, వారికి బీజేపీ నుంచి రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు ముట్టిందని అభిషేక్ బెనర్జీ ఆరోపించారు.

# కేటీఆర్ నీకు నీతి ఎక్కడిది?

## మంత్రి సీతక్క ఫైర్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. రాజ్యాంగ ఉల్లంఘన చేసి కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలను చేర్చుకున్న నువ్వు ఇవ్వాళ కోర్టుకు వెళుతున్నావా. కేటీఆర్ నీకు నీతి ఎక్కడిది అని ప్రశ్నించారు. రాజీనామా చేయకుండానే మీ పార్టీలోకి చేర్చుకున్న ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కూడా ఇచ్చారని అన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డిని మీ పార్టీలోకి



చేర్చుకుని మంత్రి పదవులు ఇవ్వలేదా అని అడిగారు. మీకు దమ్ముంటే అప్పుడు మీ పార్టీలో జాయిన్ అయి ఇప్పుడు పదవిలో ఉన్న ఎమ్మెల్యేలను రాజీనామా చేయమను అంటూ సవాల్ చేశారు. ఫిరాయింపులపై కోర్టుకు వెళ్లే అర్హత మీకు లేదని అన్నారు. 2014, 2018లో భయపెట్టి, బెదిరించి టార్చర్ చేసి సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీలను మీ పార్టీలోకి తీసుకోలేదా అని నిలదీశారు. యూట్యూబ్‌లు పెట్టుకుని పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడించిన మాత్రాన తమకు ఏమీ కాదన్నారు.

# నాలుగున్నర ఎకరాలకు 3.5 వేల కోట్లు


## ముంబైలో ఖరీదైన స్థలం కొనుగోలు చేసిన ఆర్బీఐ.. ఈ ఏడాది భూమి కొనుగోళ్లలో ఇదే రికార్డు

**మహా :** ముంబైలోని నాలుగున్నర ఎకరాల భూమి కొనుగోలుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కళ్లు చెదిరే మొత్తం వెచ్చించింది. ఏకంగా రూ.3,472 కోట్లు చెల్లించి 4.6 ఎకరాలను సొంతం చేసుకుంది. నగరంలో ముఖ్యమైన వ్యాపార కూడలి అయిన నారీమన్ పాయింట్ ప్రాంతంలో మంత్రాలయ, బాంబే హైకోర్టు, పలు కార్పొరేట్ హెడ్ క్వార్టర్ల మధ్యలో ఉన్న ఈ భూమిని ముంబై మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి స్వాధీనం చేసుకుంది. ఈ ఏడాది భూమి కొనుగోళ్లలో ఇదే రికార్డు ధర అని ముంబై రియల్ ఎస్టేట్ వర్గాలు వెల్లడించాయి. ఈ డీల్ కోసం ఆర్బీఐ చెల్లించిన స్టాంప్ డ్యూటీ రూ.208 కోట్లు కావడం గమనార్హం.



# అమెరికాలో దారుణం

- తుపాకీ హింసపై మాట్లాడుతుండగానే ట్రంప్ అనుచరుడి హత్య
- ఉటా యూనివర్సిటీలో బహిరంగ సభలో ఘటన
- కిర్క్ మృతిని ధ్రువీకరించి, నివాళులర్పించిన డొనాల్డ్ ట్రంప్
- దేశవ్యాప్తంగా పెరుగుతున్న రాజకీయ హింసపై ఆందోళన




**మహా :** అమెరికాలో రాజకీయ హింస మరోసారి పడగ విప్పింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముఖ్య అనుచరుడు, ప్రముఖ కన్జర్వేటివ్ కార్యకర్త చార్లీ కిర్క్ (31) దారుణ హత్యకు గురయ్యారు. తుపాకీ హింస, సామూహిక కాల్పులపై ప్రేక్షకుల నుంచి ప్రశ్నలకు సమాధానమిస్తున్న సమయంలోనే ఆయనపై కాల్పులు జరగడం తీవ్ర కలకలం రేపుతోంది. ఉటా రాష్ట్రంలోని ఓరెమ్ నగరంలో ఉన్న ఉటా వ్యాలీ యూనివర్సిటీలో బుధవారం ఈ ఘోరం జరిగింది. 'టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ' అనే యువజన సంస్థ వ్యవస్థాపకుడైన చార్లీ కిర్క్, తన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తి తుపాకీ హింసకు సంబంధించి ప్రశ్నలు అడుగుతుండగా, కిర్క్ సమాధానం ఇస్తున్నారు. ఇంతలోనే ఒక్కసారిగా తుపాకీ పేలిన శబ్దం వినిపించింది. ఒకే ఒక్క తూటా కిర్క్ మెడ ఎడమ భాగంలోకి దూసుకెళ్లడంతో ఆయన కుప్పకూలిపోయారు. తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ హఠాత్ పరిణామంతో అక్కడున్న వారు భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై ఓరెమ్ నగర మేయర్ డేవిడ్ యంగ్ మాట్లాడుతూ, నిందితుడు ఇంకా పట్టుబడలేదని తెలిపారు. తొలుత ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నప్పటికీ, అతను నిందితుడు కాదని దర్యాప్తు అధికారులు స్పష్టం చేశారు. కిర్క్ మృతిని డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా ధ్రువీకరించారు. "చార్లీ కిర్క్ ఒక గొప్ప వ్యక్తి, ఒక లెజెండ్. అమెరికాలోని యువత హృదయాన్ని ఆయన అర్థం చేసుకున్నంతగా మరెవరూ చేసుకోలేరు" అంటూ నివాళులర్పించారు. ఈ ఘటన అమెరికాలో నానాటికీ పెరిగిపోతున్న రాజకీయ హింసకు అద్దం పడుతోంది. కిర్క్ యూనివర్సిటీ పర్యటనపై ముందు నుంచే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆయనను క్యాంపస్‌లోకి అనుమతించవద్దని కోరుతూ దాదాపు 1000 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో పిటిషన్ కూడా దాఖలు చేశారు. అయినప్పటికీ, వాక్ స్వాతంత్ర్యాన్ని గౌరవిస్తూ యూనివర్సిటీ యాజమాన్యం కార్యక్రమానికి అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో జరిగిన హత్య దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. రిపబ్లికన్, డెమొక్రాటిక్ పార్టీలకు చెందిన పలువురు నేతలు ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

# హైదరాబాద్‌లో రోడ్డు భద్రత చర్యలు భేష్

## నిర్వహణ తీరు సూపర్.. రోడ్డు భద్రత ఏర్పాట్ల క్షేత్రపరిశీలనలో ఎస్ సీసీఓఆర్ఎస్ ఛైర్మన్

**హైదరాబాద్, మహా :** నగరం అంతటా రోడ్డు భద్రత, నిర్వహణను మెరుగుపరచడంలో జీహెచ్ఎంసీ తీసుకున్న చర్యలు బాగున్నాయని సుప్రీంకోర్టు రోడ్ సేఫ్టీ కమిటీ ఛైర్మన్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే ప్రశంసించారు. గురువారం, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తో కలిసి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే,జూబ్లీ హిల్స్‌ను మాదాపూర్‌కు అనుసంధానించే జూబ్లీ హిల్స్ రోడ్ నంబర్ 45 ఫ్లైఓవర్‌ను, కొండాపూర్ ను గచ్చిబౌలితో అనుసంధానించే పి. జనార్ధన్ రెడ్డి ఫ్లైఓవర్ పైన ప్రమాదాలు జరగకుండా జీహెచ్ఎంసీ తీసుకున్న భద్రత చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెచ్చరిక సైన్ బోర్డులు, రేడియం స్టిక్కర్లు, CC కెమెరాలు, వేగాన్ని నియంత్రించడానికి రంబుల్ స్ట్రిప్‌లు, చెవ్రాన్ బోర్డులు, కాంక్రీట్ అడ్డంకులు, రాత్రిపూట లైటింగ్ కోసం వీధి లైట్ల ఏర్పాట్లు సహా అనేక భద్రతా చర్యలను ఆయన సమీక్షించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకున్న పటిష్ట చర్యలను చైర్మన్ కు కూలంకషంగా వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు జీహెచ్ఎంసీ తీసుకున్న భద్రత చర్యల పట్ల జస్టిస్ సప్రే సంతృప్తి వ్యక్తం చేశారు.

**ఈ సందర్భంగా జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే మాట్లాడుతూ..**

ప్రతి జీవితం విలువైనది. నిర్లక్ష్యం కారణంగా అమాయకుల ప్రాణాలు కోల్పోకూడదు" అని పునరుద్ఘాటించారు. తరువాత, జస్టిస్ సప్రే నానక్‌రామ్‌గూడలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కార్యాలయాన్ని సందర్శించారు, అక్కడ అధికారులు ఔటర్ రింగ్ రోడ్ (ORR) పై ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ మరియు హైవే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటి అధునాతన సాంకేతికతల ద్వారా నిర్వహించబడే ORR మీదుగా ప్రతిరోజూ 2.5 లక్షలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయని అధికారులు తెలిపారు. ప్రమాదాలు జరగకుండా పటిష్ట పర్యవేక్షణ, భద్రత, నిఘా చర్యలతో పాటు, అనుకోకుండా వాహనదారులు ప్రమాదాల బారిన పడినప్పుడు సత్వర స్పందనకు, అత్యవసర వైద్య చికిత్స కోసం చేసిన ఏర్పాట్లను అధికారులు వివరించారు. హెచ్ ఎం డి ఏ అర్బన్ ఫారెస్ట్రీ వి ఎస్ ఎన్ వి,జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి , మెయింటెనెన్స్ చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్‌లతో క్షేత్రతనిఖీలో ఛైర్మన్ వెంట ఉన్నారు.

# అత్యాశకు పోయి కోట్లు పోగొట్టుకున్నాడు

## రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్ళు

### హైదరాబాద్‌లో ఓ వ్యాపారి నుంచి కేటుగాళ్లు రూ.1.38కోట్లు కొట్టేశారు

**హైదరాబాద్, మహా :** వనస్థలిపురానికి చెందిన ఆ వ్యాపారికి నమ్మకం కలిగించి, సైబర్ నేరగాళ్ళు దశల వారీగా ఏకంగా రూ. 1.38 కోట్లు దోచుకున్నారు. ఈ మోసం వెయ్యి రూపాయల చిన్న లాభంతో మొదలై, చివరికి భారీ నష్టానికి దారితీసింది. జూన్ 21న బాధితుడి ఫోన్ నంబర్‌ను నిందితులు 'డీ18 ఇండియా స్టాక్ పండిట్స్ సర్కిల్' అనే వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. ఆ తర్వాత సురభి గుల్షన్ సింగ్, సొట్టి అనే ఇద్దరు వ్యక్తులు అతనికి ఫోన్ చేసి, తాము స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో నిపుణులమని, అధిక లాభాలు ఇప్పిస్తామని నమ్మించారు. అనంతరం 'దేవ ఏ టీమ్ 17' అనే మరో వాట్సాప్ గ్రూప్‌లో చేర్చి, ట్రేడింగ్ కోసం ఒక లింక్‌ను పంపించారు. బాధితుడు ఆ లింక్ ద్వారా ఒక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ట్రేడింగ్ ప్రారంభించాడు. జూలై 21న అతను మొదటిసారిగా రూ. 50 వేలు పెట్టుబడి పెట్టగా, సైబర్ నేరగాళ్లు అతడికి వెయ్యి రూపాయల లాభం వచ్చినట్లు చూపించి, ఆ డబ్బును బాధితుడి ఖాతాలో జమ చేశారు. దీనితో బాధితుడికి వారిపై నమ్మకం బలపడింది. ఆ తర్వాత అతను రూ. 2 లక్షలు, మరో రూ. 3 లక్షలు డిపాజిట్ చేశాడు. స్క్రీన్‌పై లాభాలు భారీగా పెరుగుతున్నట్లు చూపించి, అతన్ని మరింత పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించారు. లాభాల మాయలో పడి రూ. 8.5 లక్షలు డిపాజిట్ చేస్తే, 'ఇనిస్టిట్యూషనల్ స్టాక్స్' కేటాయించినట్లు నమ్మించి, స్క్రీన్‌పై రూ. 17 లక్షల లాభం చూపించారు. 'లోన్ల ద్వారా ఫండ్స్ జమ చేస్తాం, మీరు పెట్టుబడి పెట్టండి' అంటూ ప్రోత్సహించారు. రూ. 1.73 కోట్ల విలువైన 7080 షేర్లను కేటాయించామని, దానివల్ల రూ. 3.5 కోట్లు లాభం వచ్చిందని నమ్మించారు. దీంతో బాధితుడు రూ. 65 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. కొన్ని రోజుల తర్వాత మరో 5.2 కోట్ల షేర్స్ కేటాయిస్తున్నామని తెలిపారు. ఆ తర్వాత రూ.40 కోట్లు లాభాలు వచ్చినట్లు చెప్పడంతో బాధితుడు నమ్మాడు. ఈ క్రమంలో మరో రూ .25లక్షలు డిపాజిట్ చేశాడు. ఇలా పలు దఫాలుగా బాధితుడు రూ.1,38,30,000 డిపాజిట్ చేశాడు. అయితే ఈ మొత్తం పెట్టుబడికి గాను అతనికి తిరిగి వచ్చింది కేవలం రూ. 1000 మాత్రమే.

### కమీషన్ ఇస్తేనే...

స్క్రీన్‌పై రూ. 40 కోట్ల లాభం ఉన్నట్లు కనిపించడంతో, బాధితుడు అందులో నుంచి రూ. 4.6 కోట్లు విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించాడు. డబ్బు విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించినప్పుడు, సైబర్ నేరగాళ్లు తమ నిజస్వరూపం బయటపెట్టారు. వచ్చిన లాభాలపై 5 శాతం కమిషన్ అంటే రూ. 1.7 కోట్లు చెల్లిస్తేనే డబ్బు విత్‌డ్రా చేసుకోవడం సాధ్యమవుతుందని మెలిక పెట్టారు. తన వద్ద ఉన్న డబ్బు మొత్తం పెట్టుబడి పెట్టానని, లాభం నుంచి కమిషన్ మినహాయించుకుని మిగతా డబ్బు ఇవ్వాలని బాధితుడు కోరగా, వారు అంగీకరించలేదు. దీంతో అనుమానం వచ్చి రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# జూబ్లిహిల్స్ బరిలో లేను

- క్లారిటీ ఇచ్చిన ఎమ్మెల్యే దానం
- టిక్కెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తా

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తానంటూ వస్తున్న వార్తలపై మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. తాను అక్కడి నుంచి పోటీ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. అవన్నీ కేవలం ఊహాగానాలేనని ఆయన కొట్టిపారేశారు. టిక్కెట్ ఎవరికి కేటాయించినా పార్టీ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఆదర్శ్ నగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గురువారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంలోనే పైవిధంగా వ్యాఖ్యలు చేశారు. ఉప ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సరైన అభ్యర్థిని ఎంపిక చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ముఖ్యమని దానం అభిప్రాయపడ్డారు.

# పేదల హక్కుల పోరాటంతో కోర్టుకు హాజరు.!

## సిపిఐ పార్టీ వర్ధిల్లాలి భూ పోరాటం వర్ధిల్లాలి

### చేవెళ్ల కోర్టుకు హాజరైన నాయకులు నినాదాలు చేశారు

**రంగారెడ్డి జిల్లా మహా:** చేవెళ్ల మండల కేంద్రంలోని 75 వ సర్వే నెంబర్ లో ఇండ్లు లేని నిరుపేదల కోసం, భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గత 31 నెలలుగా గుడిసెలు వేసి పట్టాల కోసం, అలుపెరుగని భూ పోరాటం చేస్తున్న సిపిఐ నాయకులపై, పెత్తందారులు భూ పోరాట కేసు నమోదు చేయడం జరిగింది. దానిలో భాగంగా గురువారం చేవెళ్లలోని కోర్టుకు, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల పార్టీ కార్యదర్శి కె శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం సుధాకర్ గౌడ్, గీత పని వాళ్ళ సంఘం మండల కార్యదర్శి కృష్ణ గౌడ్, నరేష్, వినోద తదితరులు హాజరైనారు.




## వేలంలో రెండు లక్షల 35వేల గణపతి లడ్డు

# లావణ్య పాండురంగారెడ్డి కైవసం

### కోలాహలంగా లంబోదరుడి శోబయాత్ర.. గంగమ్మ ఒడికి చేరుకున్న గణనాథుడు

**రంగారెడ్డి జిల్లా మహా:** బొంగులూరు గ్రామంలో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథునికి, ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ నల్లవోలు లావణ్య పాండురంగారెడ్డి, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ యొక్క గణపతి ఆశీర్వాదం పొందారు. వినాయక చతుర్థి సందర్భంగా నిర్వాహకులు నియమ నిష్ఠలతో ఆ యొక్క గణపతికి, వేద పండితులతో పూజలు అందించారు. నిమజ్జనం సందర్భంగా మండప నిర్వాహకులు నిర్వహించిన గణనాథుని లడ్డు వేలంపాట కార్యక్రమంలో పాల్గొన్న, లావణ్య పాండురంగారెడ్డి, 2లక్షల 35 వేల రూపాయలకు లడ్డు కైవసం చేసుకున్నారు. అనంతరం కోలాహలంగా ఆటపాటలతో, నిర్వాహకులు ఉత్సాహంగా అంగరంగ వైభవంగా శోభాయాత్రను కొనసాగించారు. మండపం నుండి బయలుదేరిన గణనాథుడు గంగమ్మ వడికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు, యువకులు, భక్తులు, గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు.

# విద్యార్థులు ర్యాగింగ్ కి పాల్పడితే చర్యలు తప్పవు

### సిఐ హరికృష్ణ రెడ్డి

**రాజేంద్రనగర్, మహా ;** గండిపేట్ మండల పరిధిలోని సిబిఐటి కళాశాలలోని ఆడిటోరియంలో విద్యార్థులకు నార్సింగ్ సీఐ హరికృష్ణ రెడ్డి ఆంటీ ర్యాగింగ్ అవేర్నెస్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. విద్యార్థులు ర్యాగింగ్ కి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని విద్యార్థులను సీఐ హరికృష్ణ రెడ్డి హెచ్చరించారు. జూనియర్లను సీనియర్లు ర్యాగింగ్ చేయడం జరుగుతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చదువుకోడానికి వచ్చిన విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి తప్ప ఇతర ఇతర వాటిపై దృష్టిసారించి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో సిబిఐటి కళాశాల మేనేజ్మెంట్ లింగారెడ్డి, శ్రీధర్, సెక్టార్ ఎస్సై మురళీధర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాధాకృష్ణన్ రాజీనామా

- నేడు ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేయనున్న రాధాకృష్ణన్
- గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర అదనపు బాధ్యతలు

**న్యూఢిల్లీ, మహా :**

భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ఉపరాష్ట్రపతిగా నూతన బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. రాధాకృష్ణన్ రాజీనామాతో ఖాళీ అయిన మహారాష్ట్ర గవర్నర్ పదవికి తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర బాధ్యతలను అదనంగా అప్పగిస్తూ రాష్ట్రపతి భవన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మొత్తం 752 ఓట్లకు గాను ఆయనకు 452 ఓట్లు లభించాయి. మహారాష్ట్ర రాజ్ భవన్‌లో రాధాకృష్ణన్‌కు నిన్న సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రాజీపడని జాతీయవాదినని స్పష్టం చేశారు. గవర్నర్‌గా కొనసాగిన 13 నెలల కాలాన్ని ప్రజాజీవితంలో సంతోషకరమైన సమయంగా అభివర్ణించారు. పరిపాలనాపరంగా, రాజకీయంగా మహారాష్ట్ర తనకు ఎంతో నేర్పిందన్నారు.








మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, తిరుపతి



# తెలుగు ఇండస్ట్రీకి హీరోయిన్లు కావలెను

తెలుగు ఇండస్ట్రీకి హీరోయిన్లు కావాలెను అనేది నెవర్ ఎండింగ్ ఇష్యూ..! ఎంతమంది హీరోయిన్లు వచ్చినా కూడా ఇంకా కావాలి కావాలి అంటూనే ఉంటారు మన దర్శక నిర్మాతలు. కృతి శెట్టి కనబడకుండా పోయాక.. శ్రీలీల జోరు తగ్గిపోయాక.. భాగ్యశ్రీ సైతం స్లో అయ్యాక.. మళ్లీ కొత్తందాల కోసం వేట సాగిస్తున్నారు మేకర్స్. మరి వాళ్ల ఆశ తీరేదెప్పుడు..? కొత్తమ్మాయిలు రావడం కాదు.. వచ్చిన వాళ్లు సక్సెస్ అయినపుడే హీరోయిన్ల కష్టాలకు కనీసం కామా అయినా పడుతుంది. ఇప్పుడిదే జరుగుతుంది. మిస్టర్ బచ్చన్‌తో ఎంట్రీ ఇచ్చిన భాగ్యశ్రీ బోర్సే.. మీడియం రేంజ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ అయిపోయారిప్పుడు. రామ్ పోతినేని ఆంధ్రాకింగ్ తాలూక, దుల్కర్ సల్మాన్ కాంతా సినిమాల్లో నటిస్తున్నారీమే. ప్రభాస్, హను రాఘవపూడి సినిమాతో పరిచయమవుతున్న ఇమాన్వి ఇస్మాయిల్ గురించి చర్చ బాగానే జరుగుతుంది. ఈ సినిమా విడుదలకు ముందే ఇమాన్వికి ఆఫర్స్ వస్తున్నాయి. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ డ్రాగన్ సినిమాతో రుక్మిణి వసంత్ టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. ఈ మధ్యే మదరాసిలో నటించారు రుక్మిణి. ప్రస్తుతం ఈమె బాగానే ట్రెండ్ అవుతున్నారు. ప్రదీప్ రంగనాథన్ డ్రాగన్ తర్వాత కయాదు లోహర్ పేరు బాగానే వినిపిస్తుంది. విశ్వక్ సేన్, అనుదీప్ కాంబోలో వస్తున్న ఫంకీలో నటిస్తున్నారు. ప్రభాస్ రాజా సాబ్‌తో మాళవిక మోహనన్ పరిచయం అవుతున్నారు. కన్నడ బ్యూటీ ఆషికా రంగనాథ్ కూడా రవితేజ, కిషోర్ తిరుమల సినిమాతో పాటు విశ్వంభరలో నటిస్తున్నారు. మొత్తానికి ఈ బ్యూటీస్ అంతా క్లిక్ అయితే కొన్నాళ్ల పాటు హీరోయిన్ కష్టాలు తీరిపోయినట్లే.






## తమ్ముడి భార్య కేసు.. హీరోయిన్ హన్సికకు షాక్..!

హీరోయిన్ హన్సిక సినిమాల కంటే వ్యక్తిగత వివాదాలతోనే వార్తల్లో నిలుస్తోంది. ఇటీవలే ఆమె తన భర్తతో విడిపోతోందంటూ రూమర్స్ గట్టిగానే వినిపించాయి. తన ఇన్‌స్టా అకౌంట్ నుంచి హన్సిక పెళ్లి ఫోటోలు, వీడియోలు డిలీట్ చేయడంతో రూమర్స్ మొదలయ్యాయి. అంతేకాకుండా సోహెల్‌కు రెండో పెళ్లి కావడంతోనే వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయని మరో టాక్ వినిపించింది. అయితే ఇవన్నీ చూస్తుంటే తనకు నవ్వొస్తుందని హన్సిక కొట్టిపారేసింది. ఈ సంగతి అటుంచితే గతంలో హన్సికతో ఆమె తల్లి జ్యోతిలపై సోదరుడి భార్య ముస్కాన్ గృహ హింస కేసు పెట్టారు. తనను వేధింపులకు గురి చేశారని బుల్లితెర నటి ముస్కాన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఈ కేసులో ఇప్పటికే హన్సిక, ఆమె తల్లికి ముంబయి సెషన్స్ కోర్ట్ బెయిల్ మంజూరు చేసింది. కానీ ఈ కేసును క్వాష్ చేయాలంటూ హన్సిక బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా హన్సిక పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఆమె విజ్ఞప్తిని తిరస్కరించింది. హన్సిక దాఖలు చేసిన పిటిషన్ బాంబే హైకోర్టు కొట్టిపారేసింది. దీంతో ఈ కేసులో నిరాశే ఎదురైంది. కాగా.. హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వానీ.. టీవీ నటి ముస్కాన్ జేమ్స్‌ను 2020లో వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో 2022లో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో హన్సికతో పాటు సోదరుడు ప్రశాంత్, తల్లి జ్యోతిలపై ముస్కాన్ ఫిర్యాదు చేసింది.

## తేజ నుంచి చాలా నేర్చుకున్నా...

'నా తొలి చిత్రం అశోకవనంలో అర్జున కళ్యాణం తర్వాత ఒక మంచి క్యారెక్టర్ కోసం చూస్తున్నప్పుడు 'మిరాయ్' అవకాశం వచ్చింది. అద్భుతంమైన కథ. నా క్యారెక్టర్ చాలా నచ్చింది. వెంటనే ఓకే చెప్పేశాను. ఈ చిత్రంలోని యాక్షన్ అడ్వంచర్ ఆడియన్స్ గొప్ప అనుభూతిని ఇస్తుంది' అని అన్నారు హీరోయిన్ రితీకా నాయక్. హనుమాన్ తర్వాత తేజ సజ్జ నటించిన తాజా మూవీ 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మంచు మనోజ్ విలన్‌గా నటించారు. సెప్టెంబర్ 12న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా హీరోయిన్‌గా రితీకా నాయక్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ సినిమా కోసం చాలా ఎక్సయిటెడ్ గా ఉన్నాను. చాలా హార్డ్ వర్క్ చేసి సినిమా చేశాం. ముఖ్యంగా తేజ చాలా కష్టపడ్డాడు. షూటింగ్ సమయంలో ఆయనకు చాలా గాయాలు అయ్యాయి. కొన్నిసార్లు అనారోగ్యం కూడా చేసింది. అయినప్పటికీ ఆయన కరెక్ట్ టైం కి సెట్ లో ఉండేవారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. మనోజ్ చాలా పవర్ఫుల్ క్యారెక్టర్ లో కనిపిస్తారు. ఆఫ్ స్క్రీన్ ఆయన చాలా ఫన్ ఫుల్ గా ఉంటారు. చాలా స్వీట్ పర్సన్. ఈ సినిమాలో దాదాపు 80% లైవ్ లొకేషన్స్ లో షూట్ చేశాం. ప్రతి రియల్ టైమ్ లొకేషన్స్ లోకి వెళ్లడం వెరీ చాలెంజింగ్. అయితే మా టీమ్ అందరూ చాలా సపోర్ట్ చేశారు. వారి సపోర్ట్ తో జర్నీ చాలా అద్భుతంగా జరిగింది. కార్తీక్ సినిమాని చాలా అద్భుతంగా తీశారు. ఆయనతో కలిసి వర్క్ చేయడం చాలా ఆనందాన్నిచ్చింది. కథలో ప్రాధాన్యత ఉన్న అన్ని రకాల పాత్రలు చేయాలని ఉంది. పెర్ఫార్మెన్స్ కి స్కోప్ ఉండే అన్ని రకాల పాత్రలు చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రస్తుతం వరుణ్ తేజ్ తో ఒక సినిమా చేస్తున్నాను. అలాగే ఇంకొన్ని ప్రాజెక్ట్స్ కూడా రెడీగా ఉన్నాయి.



## సిద్ధు జొన్నలగడ్డ కొత్త సినిమా..
### రొమాంటిక్ టీజర్ చూశారా?

'తెలుసు కదా' సినిమా నుంచి క్లాసిక్ టీజర్ విడుదలైంది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న రొమాంటిక్ డ్రామా చిత్రంలో హీరోయిన్‌గా రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. స్టైలిస్ట్ నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబరు 17న విడుదల కానుంది. డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' వంటి హిట్ చిత్రాల తర్వాత ఆయన నటించిన మూవీ జాక్ నిరుత్సాహపరిచింది. దీంతో 'తెలుసు కదా' మూవీపైనే ఆయన ఆశలు పెట్టుకున్నారు. ఇందులో వైవా హర్ష కీలక పాత్రలో నటించారు. తమన్ సంగీతం అందించారు.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034